క్లుప్తంగా

నేటి నుంచి స్కూళ్లకు దసరా సెలవులు

కందనూలు: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అన్ని విద్యా సంస్థల పరిధిలోని స్కూళ్లకు నేటి నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థలు సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యోగాతో ఏకాగ్రత

కొల్లాపూర్: యోగాతో ఏకాగ్రత సాధించవచ్చని యోగా శిక్షకులు శంకర్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో జూనియర్ కళాశాలల విద్యార్థులకు యోగా శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగా ఆసనాలను వేసి చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

వెల్దండ: మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ బీసీ వసతి గృహం శిథిలావస్థలో ఉండడంతో వర్షకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పైకప్పు పెచ్చులూడి పడడంతో విద్యార్థులు భయందోళన గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్, కోకన్వీనర్ శివ, చరణ్, హరీష్ తదితరులు ఉన్నారు.

విద్యా హక్కు చట్టం అమలు చేయాలి



కల్వకుర్తి: ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని, అమలుకు ముందే నియామకమైన ఉపాధ్యాయులకు పరీక్షలో మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి మునగాల సతీష్ డిమాండ్ చేశారు. శనివారం కల్వకుర్తికి వచ్చిన తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ కమిటీ చైర్మన్ కేశవరావుకు అక్షర వనంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యా విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై ఆయనతో చర్చించారు. టెట్ తప్పనిసరి చేస్తూ ఉపాధ్యాయుల నిబంధనలను సవరిస్తూ చట్టం తేవాలని కోరారు. కొండారెడ్డి, పోచయ్య, మంగులాల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఉప్పల పరామర్శ

కల్వకుర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్‌కు పితృవియోగం కావడంతో శనివారం ఉప్పలచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పరామర్శించారు. అంతకుముందు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఉప్పల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 22 నుంచి నిర్వహించే దసరా ఉత్సవాలలో పాల్గొనాలని ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఆహ్వాన పత్రిక అందించి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడమ సత్యం, శ్రీశైలం, సూర్య ప్రకాష్ రావు, మధు, గోపాల్ నాయక్, శ్రీశైలం గౌడ్, రాజు, పూరి రమేష్ పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వైఆర్ఆర్ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం సాయిచంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ గళం, స్వరాష్ట్ర ఆకాంక్షలు నడిపిన గొప్ప గాయకుడు సాయిచంద్ అని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో విజయ్ గౌడ్, ఎడ్మ సత్యం, సూర్య ప్రకాశరావు, బాలయ్య, కొండూరు గోవర్ధన్, జంగయ్య, శ్రీనివాస్, బొజ్జన్న, తహరాలి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయంలో చండీహోమం

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం చండీహోమం నిర్వహించారు. స్వామివారిని, శ్రీలక్ష్మీ, ఆండాళమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పంట దిగుబడి వచ్చేనా?

- తెగుళ్లబారిన పంటలు
- తేలిపోతున్న తెల్లబంగారం
- భారీ వర్షాలకు రైతన్నకు నష్టం



అమ్రాబాద్ సమీపంలో తెగుళ్లబారిన పత్తిపంట

అమ్రాబాద్: వానాకాలంలో సాగుచేసిన పంటలు దెబ్బతినడంతో రైతన్నకు కునుకు లేకుండా చేస్తోంది. ఎంతో ఆశతో పంటలు సాగుచేస్తే కనీసం పెట్టుబడులు కూడా వచ్చేవిధంగా లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. గత నెలలో వరుసగా కురిసిన వర్షాలకు పంటలలో వర్షపునీరు రోజుల తరబడి నిలిచింది. దీంతో పంటలు తెగుళ్లబారిన పడి దెబ్బ తిన్నాయి. పంటలను కాపాడుకోలేక రైతులు దిక్కు తోచనిస్థితిలో పడ్డారు.

పంటల సాగు వివరాలు

మండలంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం 16 వేల ఎకరాల పై చిలుకు సాగుభూమి ఉండగా అటవీ, అసైన్డ్ భూములు కలిపి మొత్తం 25 వేల ఎకరాల వరకు రైతులు వివిధ రకాల వానాకాలం పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వానాకాలం పత్తి 1595, వరి 833, మిర్చి 685, కంది 105, జొన్న 50, మినుములు 23, మొక్కజొన్న 15, ఆముదం 05 ఎకరాల చొప్పున సాగుచేశారు.

పంటలను పరిశీలించని అధికారులు

అధిక వర్షాల కారణంగా పంటలు తెగుళ్లబారిన పడ్డాయి. ముఖ్యంగా పత్తి, కంది పంటలలో తెగులు సోకాయి. పత్తి పంట ప్రస్తుతం గూడ, కాయలు పట్టె దశలో ఉంది. ఈ సమయంలో పంట ఎర్రబారిపోవడం, పూత, పిందె రాలడం జరుగుతుంది, కందిలో శెనగపచ్చ పురుగు అధిక మయింది. పంటలు తెగుళ్ల భారిన పడినా సంబంధిత అధికారులు పంటలు పరిశీలించి తగు సూచనలు చేయడంలేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పంటలకోసం అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామని పంట ఆశకలిగించినా అధిక వర్షాలతో కాత దశలోనే పంట పాడవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పంటలను పరిశీలించి తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వర్షాలతోనే తెగులు

అధిక వర్షాలతో తెగుళ్లు వస్తున్నాయి. మాకున్న సమయంలో పొలాలను తిరిగి పరిశీలించి రైతులకు తెగుళ్ల నివారణ కోసం అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం పత్తి పంటలో నీరు నిల్వ ఉండకుండా బయటకు పంపి, అంతరకృషి చేయాలి, వేరుకుళ్లు తెగులు రాకుండా కాపర్‌ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాముల మందును లీటరునీటి చొప్పున కలిపిమొక్కల మొదళ్లలో పోయాలి,మల్టి-కే నీటిలో కరిగే మందును ఐదు నుంచి పది గ్రాముల వరకు లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారి చేయాలి.

– మహేష్‌రెడ్డి, ఏఓ, అమ్రాబాద్

పిందె రాలుతోంది



ఐదు ఎకరాలలో పత్తిపంట సాగు చేశాను. పత్తి చేను పిందె, కాత దశలో ఉంది. వర్షాల వల్ల పిందె, గూడ రాలుతోంది. ఎన్ని మందులు కొట్టినా తెగుళ్లు పోవడంలేదు. పెట్టుబడులు కూడా వచ్చేటట్లు లేదు. అధికారులు పంటలను పరిశీలించి నష్ట పరిహారం ఇవ్వాలి.

– జగదీష్ గౌడ్, రైతు, అమ్రాబాద్

అధికారులు పంటలను చూడాలే



నాలుగెకరాలు పత్తి వేశాను. ఏ తెగుళ్లకు ఏ మందు కొట్టాలో తెలియదు. పంటలపై అధికారులు అవగాహన కల్పించాలి. వర్షాల తర్వాత అధికారులు పంటలను పరిశీలించలేదు. వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

– సీతారాములు, రైతు, కొత్తపల్లి

స్వచ్ఛభారత్ అందరి బాధ్యత



కల్వకుర్తిలో స్వచ్ఛభారత్ లో పాల్గొన్న ఆచారి

కల్వకుర్తి రూరల్: స్వచ్ఛభారత్ అందరి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం పురస్కరించుకొని శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛభారత్ కింద సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం కోసం కేంద్రం ప్రభుత్వం రూ.10 కోట్లు నిధులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. అనంతరం మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందిని సత్కరించారు. గన్నోజు బాబీ దేవ్, దుర్గాప్రసాద్, నరసింహ, రాంభూపాల్ రెడ్డి, శ్యామ్, శేఖర్‌రెడ్డి, రవి గౌడ్, సురేందర్ గౌడ్, చందు ముదిరాజ్, గండోజు గంగాధర్, వివేకానంద, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్లను శుభ్రం చేసిన నాయకులు

చారకొండ: మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకొని స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రోడ్లను శుభ్ర చేసి పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. చెలమోని కృష్ణ, ఉపాధ్యక్షుడు కామోజీ శ్రీకాంత్, నాయకులు ఏదిరే రవీందర్, రవి నాయక్, నరేష్, బండ్ల మల్లేష్, శరత్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

లింగాల: బీజేపీ నిర్వహిస్తున్న సేవా పక్షంలో భాగంగా ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం మండలంలోని సూరాపూర్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గువ్వని నవీన్, సేవా పక్షం మండల కన్వీనర్ అతినారపు సాయిసాగర్, నాయకులు చెవ్వ సైదులు, హేమంత్, శ్రీనివాసులు, కిషోర్, సత్యనారాయణ, మహేష్, సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

తిమ్మాజిపేట: మండలంలోని ఆవంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా కోకన్వీనర్ జెట్టి వెంకటేష్ మాట్లాడుతూ పీఎం మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్వోడ కార్యక్రమంలో నిర్వహించామన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు వస్పరి శారదశివలింగం, కారుణ్య, జ్ఞానేశ్వరీ, మేఘన, పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



మన్ననూర్: ఖాతాదారులకు ఈకేవైసీ తప్పనిసరి అని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ బాణావత్ రాములు అన్నారు. శనివారం బ్యాంకు సమీపంలో నిర్వహణలో ఉన్న సీఎస్పీ సెంటర్ వద్ద ఈకేవైసీ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోని ఖాతాదారులు ఆధార్ కార్డుతో ఇచ్చి ఖాతాను పునరుద్ధరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉపేందర్, సిబ్బంది రాంప్రసాద్, సీఎస్పీ నిర్వాహకులు సరిల, సైదులు, శంకర్ ఖాతాదారులు పాల్గొన్నారు.

మెడిసిన్‌లో మెరిసిన విద్యార్థులు





లక్ష్మీమేఘన

కల్వకుర్తి రూరల్/కొల్లాపూర్/అచ్చంపేట: కల్వకుర్తి పట్టణానికి చెందిన లక్ష్మీమేఘన ఇటీవల విడుదలైన నీట్ పరీక్షలో 123 క్యాటగిరితో రాష్ట్రస్థాయిలో 1207 ర్యాంకు సాధించింది. శనివారం నిర్వహించిన మెడికల్ కౌన్సెలింగ్‌లో వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. కొల్లాపూర్ మండలం కుడికిళ్ల గ్రామానికి చెందిన బచ్చలకూర అరుంధతి నీట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 3,928 ర్యాంకు సాధించింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు లభించింది. అదేవిధంగా నీట్‌లో ప్రతిభ కనబర్చిన అచ్చంపేటకు చెందిన విద్యార్థి తూర్పాటి రాజారాంను అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.



అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని పలు వార్డులలో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మున్సిపాలటీ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు గుర్తుచేశారు. అనంతరం సుమారు రూ.72 లక్షలతో జేపీ నగర్ పాఠశాల అభివృద్ధి పనులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కాంపౌండ్, ఎన్‌జీఓ కాలనీలో సీసీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే పట్టణంలోని సూర్యలత స్పిన్నింగ్ మిల్లు వారు ప్రభుత్వ కళాశాలకు అందజేసిన 100 బెంచీలను కళాశాలకు అందజేశారు. దాతను ఆయన అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, ప్రిన్సిపాల్ రామ్‌రెడ్డి, ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు సుగుణమ్మ, లెక్చరర్లు, కాటన్‌మిల్లు రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి

తెలకపల్లి: రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ అమలు చేసి ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పర్వతాలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మొదటి ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చి ఇప్పుడు జాప్యం చేస్తుందని ఆరోపించారు. గత ప్రభుత్వం కేవలం 55వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1.45 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినా.. ఎన్నికల హామీ నెరవేరలేదన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తుందని, ఉద్యోగులకు ఒత్తిడి పెంచుతుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు నాగపూర్ మధు, నాయకులు భాస్కర్, బాలు, జగదీష్‌బాబు, ఉస్సేన్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



తాడూరు: ఇటీవల అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పత్తి పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతులు మదుసూదన్ రావు, పాపరాయుడు, కృష్ణయ్య, సత్యం, బంగారయ్య, కేశవులు, తదితరలు పాల్గొన్నారు.

మండపాలు సిద్ధం

వెల్దండ: మండల కేంద్రంతో పాటు కుప్పగండ్ల, చెర్కూర్, కొట్ర తదితర గ్రామాల్లో దుర్గామాత ఉత్సవాలకు మండపాలను సిద్ధం చేశారు. కుప్పగండ్లలో శివనాగ దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు. ప్రతి ఏడాది ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.



గిరిజన హాస్టల్ వర్కర్స్ వంటావార్పు



కొల్లాపూర్: గిరిజన హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివవర్మ డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం పట్టణంలో హాస్టల్ వర్కర్లు వంటావార్పు చేపట్టారు. అక్కడే వారు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సలీం, దామోదర్, వెంకటేష్, శారదమణి, బాలస్వామి, రమణమ్మ, పార్వతమ్మ, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



తిమ్మాజిపేట: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులకు వెల్‌కం పార్టీ ఏర్పాటు చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. వార్షిక పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈఓ సత్యనారాయణశెట్టి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తెలుగు అధ్యాపకురాలు జయలక్ష్మి, వెంకన్న, శోభారాణి, వెంకటయ్య, శంషాద్, తులసీ, జయలక్ష్మి, విజయలక్ష్మి, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన ఎల్లమ్మకు రూ.16వేలు, పబ్బు కల్పనకు రూ. 22,500 లు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారంలో బాధిత కుటుంబాలకు కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, శ్రీను, శివ, శ్రీను, దనుష్, హరిలాల్, తిరుపతి, లచ్చిరాం, నవీన్, లక్ష్మీనారాయణ, కొండల్, రాములు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

కల్వకుర్తి టౌన్: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవలో భాగంగా కళాశాల ప్రాంగణాన్ని విద్యార్థులతో కలిసి మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛతా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ కిట్ల పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలా, జీడిపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు యూత్ ఫర్ సేవ సంస్థ ఆధ్వర్యంలో స్టడీ కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు అనిల్ భగత్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతనిస్తామన్నారు. ఎంఈఓ శంకర్ నాయక్, హెచ్‌ఎం వెంకటరమణ, కృష్ణారెడ్డి, రఘురాం, శశిధర్ పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా

బిజినేపల్లి: మూడు నెలల నుంచి జీతాలు అందడం లేదని వెంటనే వేతనాలు చెల్లించాలని కోరుతూ శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. జీతాలు ఇవ్వకపోతే పండుగలు ఎలా చేసుకుంటామని ప్రశ్నించారు. అంతకుముందు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ శ్రీనివాసులు, కార్మికులు రాములు, రామకృష్ణ, శ్రీశైలం, శంకర్, స్వామి, సురేష్, రాము, ఎల్లయ్య, సుజాత, మైబుస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం



తిమ్మాజిపేట: మండల కేంద్రంలో స్వస్థనారి శక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ సుష్మ తెలిపారు. శిబిరంలో చర్మ వ్యాధికి సంబంధించిన పరీక్షలు, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. అదేవిధంగా చర్మ వ్యాధి ఉన్న వారిని గుర్తించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. వైద్య శిబిరం వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మెడికల్ ఆఫీసర్ సుష్మ, డాక్టర్ ఇస్మాయిల్, నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రి డెర్మటాలజి డాక్టర్ వివేక్, ఫార్మసీ ఆఫీసర్ బాలరాజ్, రోజులిన్, సరళ, రాణి, డీపీఎంఓ వెంకటయ్య, ఏఎన్‌ఎం సాలేహా, ఓఎస్ యాదయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ముట్టడి

పెద్దకొత్తపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్లను పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం కల్వకోలు గ్రామ సచివాలయాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ముట్టడించారు. ఈ నెల 22న కొల్లాపూర్‌లో నిర్వహించే పెన్షన్ల సదస్సును విజయవంతం చేయాలని గ్రామస్తులను కోరారు. మద్దిలేటి, నారాయణ, బాలపీర్లు ఉన్నారు.

హామీని నిలబెట్టుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రభుత్వం ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు కురుమయ్య డిమాండ్‌చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారి ఉమకు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం వెంటనే కొత్త పెన్షన్లు మంజూరు చేసి, పెన్షన్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో అంజి, మాణిక్యం, రామ్‌రెడ్డి, రమేష్, వల్లమ్మ, సురేష్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తెలకపల్లి: ఉపాది కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని మేట్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేతనాలు చెల్లించకపోతే నిరహర దీక్ష చేపడుతామని హెచ్చరించారు. పండుగలు ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా జీతాలు చెల్లించాలని కోరారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



కల్వకుర్తి ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఎత్తుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చారు. విద్యార్థులు తయారుచేసిన బతుకమ్మల చుట్టూ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ అలరించారు. జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) పట్టణ కమిటీ, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కల్వకుర్తి ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో డీఈఓ రమేష్‌కుమార్‌లు హాజరయ్యారు. తెలకపల్లి, బిజినేపల్లి, పెద్దకొత్తపల్లి, అమ్రాబాద్, కోడేరు, ఉప్పునుంతల, వెల్దండ, తిమ్మాజిపేట, మన్ననూరులో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. సాయంత్రం సమీప చెరువులలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పెద్దకొత్తపల్లి, అమ్రాబాద్, లింగాల ఎంఈఓలు శ్రీనివాస్‌రెడ్డి బాలకిషన్, బషీర్‌అహ్మద్, ప్రిన్సిపాల్స్, జర్నలిస్ట్ మధు గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో..



తిమ్మాజిపేటలో..



నాగర్‌కర్నూల్ సరస్వతీ శిశుమందిర్‌లో..